

ఎల్ఓసీ అందజేత

విశ్వంభర, మీర్ పెట్ : మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు, మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.1,00,000 ఎల్ ఓ సి ప్రశాంతి హిల్స్ 58వ డివిజన్‌కు చెందిన రాఘవ సాయి గౌడ్ కు సబితా ఇంద్రారెడ్డి గ నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు , కుటుంబ సభ్యులు తమకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి సహాయ నిధికి, ప్రత్యేక చొరవ తీసుకొని సహాయం మంజూరు చేయించిన సబితా ఇంద్రారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 58వ డివిజన్ నాయకులు రామిడి నర్సిరెడ్డి, బొమ్మిడిక ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

బహదూర్ పుర పాఠశాలలో పుస్తకాల పంపిణీ

విశ్వంభర, చార్మినార్ : మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్న పాఠశాల లో విద్యార్థులకు పుస్తకాలు అందించడానికి బహదూర్పుర 1 మండల కేంద్రం నుండి పాఠశాల లకు పుస్తకాల పంపిణీ మంగళవారం ప్రారంభం అయింది .బహదూర్ పుర 1 డిప్యూటీ ఐఓఎస్ పెద్దిరెడ్డి వెంకటరెడ్డి పుస్తకాల పంపిణీ ఏర్పాట్లు పరిశీలించారు .ఈ సందర్భంగా పాఠశాల ప్రారంభం రోజు విద్యార్థుల కు పుస్తకాలు అందజేయాలని కోరారు.ప్రభుత్వ బాలుర అందుల పాఠశాల దారుల్ షిఫా తో పుస్తకాల పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి సద్గుణ , ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు మందడి వెంకటరెడ్డి ,ఉపాధ్యాయులు రవికాంత్,రమ సమగ్ర శిక్ష సిబ్బంది కౌసల్య, దీపిక, జమీల్ పాల్గొన్నారు.

పూర్తి అయిన జనగణన మొదటి దశ సర్వే

విశ్వంభర, చార్మినార్ : జనగణన 2027 లో భాగంగా జరుగుతున్న ఇండ్ల సర్వే మంగళవారం నాటికి పూర్తి అయిందని చార్మినార్ సర్కిల్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ సరితా రెడ్డి తెలిపారు. అన్ని వార్డులు, ఇండ్ల సర్వే పూర్తి చేయడం జరిగింది అని ,సర్కిల్ నెంబర్ 41 పరిధి లో సూపర్వైజర్ వెంకట్ రెడ్డి తో సర్వే రిపోర్ట్ ను వార్డు ఇంచార్జి ఆమీర్ కు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన సూపర్వైజర్ కు , ఎన్యూమరేటర్లకు ధన్యవాదాలు తెలియజేశారు. సర్వే విజయవంతం గా పూర్తి కావడానికి సహకరించిన సరితా రెడ్డి ,ఆమిర్, తులసి ల కి సూపర్వైజర్ లకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్ లు శ్రీనివాస్ ,సాగర్ రెడ్డి, రవికాంత్ ,మాధవి ,శాంతమ్మ, అశ్విని, సారిక, శీను ల ను అభినందించారు.

తుర్కపల్లిలో గంజాయి ముఠా గుట్టురట్టు.. ముగ్గురు అరెస్ట్

విశ్వంభర, యాదాద్రి భువనగిరి ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు తుర్కపల్లి ఎస్ఐ మహమ్మద్ తఖియుద్దీన్ తన సిబ్బందితో కలిసి మంగళవారం కాలువ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద 250 గ్రాముల గంజాయి లభించింది. పోలీసుల విచారణలో నిందితులు సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం కర్కపట్ల గ్రామానికి చెందిన గిరిమిల్ల సాయి మధు నుంచి గంజాయిని కొనుగోలు చేసి తుర్కపల్లి ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. ఈ కేసులో గిరిమిల్ల సాయి మధు (20), పసుల లింగస్వామి (19), సయ్యద్ జావీద్ (20) లను అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి 250 గ్రాముల గంజాయి, ఒక పల్సర్ మోటార్‌సైకిల్, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



రూపాయి పన్ను పెంచకుండానే 'అద్భుత ప్రగతి'



విశ్వంభర, యాదాద్రి భువనగిరి ప్రతినిధి : గత పాలకుల చేతకానితనం వల్ల రాష్ట్రం పై పడిన రూ. 8 లక్షల కోట్ల అప్పుల భారాన్ని మోస్తూనే, ఏటా రూ. 76 వేల కోట్లు అసలు, వడ్డీల రూపంలో చెల్లిస్తూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా 'ఇందిరమ్మ రాజ్యం' నడిపిస్తున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. మంగళవారం భువనగిరిలో నిర్వహించిన విద్యుత్ శాఖ అభివృద్ధి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. రోజుకో అబద్ధం సృష్టిస్తూ, కట్టుకథలతో విషప్రచారం చేస్తున్న ప్రతిపక్షాల వైఖరి పై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేతగా తాను చేపట్టిన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్నామని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఉచిత కరెంట్ పేరుతో ఓట్లు దండుకుందే తప్ప, డిస్కంలకు నిధులు ఇవ్వకుండా అప్పులపాలు చేసిందని భట్టి విక్రమార్క విమర్శించారు. గత పాలకులు పెట్టిన బకాయిలను క్లియర్ చేస్తూనే, రాష్ట్రంలోని 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు అయ్యే విద్యుత్ ఖర్చు రూ. 14 వేల కోట్లను మా ఆర్థిక శాఖ ద్వారా ప్రతి నెలా ప్రణాళికాబద్ధంగా డిస్కంలకు చెల్లిస్తున్నాం. ఉచిత కరెంట్ ఇవ్వడమే కాకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నాం అని చెప్పారు. 202324లో 15 వేల మెగావాట్ల పీక్ డిమాండ్ వచ్చినప్పుడే చేతులెత్తేసిన గత పాలకుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ, తమ ప్రభుత్వం 202526 ఆర్థిక సంవత్సరంలో 18,546 మెగావాట్ల రికార్డు స్థాయి పీక్ డిమాండ్ నమోదైనప్పటికీ కనురెప్పపాటు కూడా కరెంట్ పోకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేసి ఘనత సాధించిందని తెలిపారు. హరీశ్‌రావు వేస్తున్న అభాండాలను ప్రజలంతా గమనిస్తున్నారని, రోజుకో అబద్ధంతో కట్టుకథలు అల్లుతూ విషప్రచారం చేస్తున్న వారిని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణంతో పాటు వడ్డీలేని రుణాల కింద కేవలం రెండున్నరేళ్లలోనే రూ. 67 వేల కోట్ల రుణాలు అందించామని భువనగిరి గడ్డ పై నుంచి ప్రకటించారు. ఐదేళ్లలో ఈ మొత్తాన్ని రూ. 1.25 లక్షల కోట్లకు పెంచి రాష్ట్రంలోని మహిళలందరికీ వడ్డీ లేని రుణాలు అందిస్తామని తెలిపారు. మహిళా సంఘాల ద్వారానే బస్సులు కొనుగోలు చేయించి ఆర్టీసీలో నడిపేలా విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. రాష్ట్రంలోని కోటి 6 లక్షల పేద కుటుంబాలకు ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున రూ. 5055 విలువైన సన్న బియ్యానికి ఉచితంగా అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని, పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఈ పని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నిర్వీర్యం చేసిన టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి, కొద్ది రోజుల్లోనే 76 వేల ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ. 5 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను క్రమపద్ధతిలో విడుదల చేస్తున్నామని చెప్పారు. ఇక పై దళారీల ప్రమేయం లేకుండా ఈ నిధులను నేరుగా విద్యార్థుల ఖాతాల్లోనే జమ చేసే విధానాన్ని అమలు చేయాలని యోచిస్తున్నామని వెల్లడించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో గత ప్రభుత్వం పేదలను దారుణంగా మోసం చేసిందని, ఆ సొమ్మంతా వారి ఇళ్లకే వెళ్లిపోయిందని భట్టి విమర్శించారు. దానికి భిన్నంగా 'ఇందిరమ్మ ఇళ్లు' పథకం కింద ఇల్లు లేని ప్రతి పేదవానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. మొదటి విడతలోనే రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. ఈ ఏడాది కూడా ప్రతి నియోజకవర్గానికి అదనంగా మరో 2,000 ఇళ్లను కేటాయించనున్నట్లు హామీ ఇచ్చారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు కులమతాలకు అతీతంగా ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే రూ. 5 లక్షల భీమా రక్షణ కల్పించేలా 'ఇందిరమ్మ కుటుంబ భీమా' పథకాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు రోజుకు 18 గంటలు శ్రమిస్తుంటే, ఓర్వలేక ప్రతిపక్షాలు కుళ్లు రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాల వల్ల ఏర్పడిన అప్పుల భారం లేకపోతే తెలంగాణ దశ, దిశ ఇప్పటికీ పూర్తిగా మారిపోయేదని వ్యాఖ్యానించారు. బసవాపురం భూ నిర్వాసితుల సమస్యలను ప్రస్తావిస్తూ వారికి పరిహారం త్వరగా అందేలా తక్షణ చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు.

విద్యుత్ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన..

టీజీవీఎస్పీడీసీఎల్ యాదాద్రి భువనగిరి జిల్లా సర్కిల్ పరిధిలో, భువనగిరి పట్టణంలోని ఓంకార్ థియేటర్ పక్కన రూ. 5.83 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన సర్కిల్ కార్యాలయ భవనాన్ని డిప్యూటీ సీఎం ప్రారంభించారు. భూదాన్ పోచంపల్లి మండలం వంకమామిడి గ్రామంలో రూ. 2.67 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను కూడా ఇదే కార్యక్రమం నుంచి రిమోట్ విధానంలో ప్రారంభించారు. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడంతో సుమారు 1,279 మంది రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందనుంది. అలాగే భువనగిరి మండలం హనుమాపురం గ్రామంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఎదురుగా రూ. 2.03 కోట్లతో నిర్మించనున్న 'స్టార్ కాంప్లెక్స్'కు, వలిగొండ మండలం నర్సాపూర్ గ్రామంలో రూ. 3.52 కోట్లతో చేపట్టనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి, తడక వెంకటేశం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిష్తీ, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, కలెక్టర్ అనురాగ్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన ఆలయాల్లో చేనేత శాలువాలే అందించాలి

మంత్రి కొండా సురేఖకు వినతి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో భక్తులకు చేనేతతో తయారు చేసిన శాలువాలే అందించాలని మంత్రి కొండా సురేఖను కలిసి పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ చేనేత కళాకారుడు గజం అంజయ్య వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం అనేక దేవాలయాల్లో కృత్రిమ నూలుతో మరమగ్గాలతో, మిల్లుల్లో తయారైన శాలువాలు వినియోగిస్తున్నారని మంత్రికి వివరించారు. గజం అంజయ్య సూచనలను మంత్రి కొండా సురేఖ సానుకూలంగా స్వీకరించారు. అంజయ్య చేస్తున్న కృషిని మంత్రి ప్రశంసించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భారతీయ సంప్రదాయాల సంరక్షణలో చేనేత కార్మికుల పాత్ర అమూల్యమని అన్నారు. ఆలయాల్లో చేనేత వస్త్రాల వినియోగం దిశగా ప్రభుత్వం పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు. చేనేత రంగ పురోగతికి, చేనేత కార్మికుల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి కొండా సురేఖను రోజు జూబ్లిహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా చేనేతకారులు స్వచ్ఛమైన నూలుతో తయారైన శాలువాతో మంత్రిని సత్కరించారు. యాదాద్రి, భద్రాచలం, బాసర, వేములవాడ తదితర ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, సేవల్లో పాల్గొనే భక్తులకు అందించే శాలువాలు ప్రస్తుతం పెద్దమొత్తంలో మరమగ్గాలు, మిల్లుల్లో కృత్రిమ నూలుతో తయారవుతున్నాయని ఆయన మంత్రి సురేఖ గారికి వివరించారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా దేవాలయాల్లో ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధిస్తున్న పరిస్థితుల్లో సింథటిక్ నూలుతో తయారైన శాలువాల వినియోగాన్ని కొనసాగించడం సముచితం కాదని తన అభిప్రాయాన్ని మంత్రి సురేఖకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో చేనేత రంగానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లల ఫీజు రాయితీపై మంత్రి పొంగులేటి హామీ

విశ్వంభర, ఖమ్మం బ్యూరో : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్ హెచ్ 2843) ఖమ్మం జిల్లా కమిటీ విజ్ఞప్తిపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 % ఫీజు రాయితీ కల్పించాలని టీ డబ్ల్యూ జేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ స్థానిక ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్ లో మంగళవారం వినతిపత్రం సమర్పించింది. దీనిపై స్పందించిన మంత్రి జిల్లా కలెక్టర్, డీఈవోలకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ వినతిపత్రాన్ని కలెక్టర్ కు పంపాల్సిందిగా తన వ్యక్తిగత సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. జర్నలిస్టుల్లో చాలామంది పేదలు, మధ్యతరగతి వర్గానికి చెందిన వారని, చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని టీడబ్ల్యూజేఎఫ్ వినతిపత్రంలో పేర్కొంది. అనేక మంది జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు కాబట్టి వారిని అవకాశం ఉన్న మేరకు ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉన్నదని జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు సామాన్యుడికి అందుబాటులో లేవని అన్నారు. ఈనేపథ్యంలో జర్నలిస్టులు తమ పిల్లలను చదివించుకోవటం భారం అవుతోందని పేర్కొన్నారు .ప్రతీ ప్రైవేటు, కార్పొరేటు పాఠశాల, కళాశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇచ్చేలా... సమాచార శాఖ మంత్రిగా ప్రభుత్వం తరపున ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరడంతో ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారికి ప్రభుత్వం నుంచి తగు ఆదేశాలు జారీ చేయిస్తానని మంత్రి స్పష్టతనిచ్చారు. మంత్రికి వినతి పత్రం సమర్పించిన వారిలో టీబీజేఏ జిల్లా అధ్యక్షులు ఆవుల శ్రీనివాస్, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు మారెడ్డి నాగేందర్ రెడ్డి, మధుశ్రీ, జానీపాషా, యాకేష్, గణేష్, పెండ్ర అంజయ్య, కొమిరె నాగేశ్వరరావు, అర్షద్, ఫయాజ్, యాకూబ్ పాషా, శరత్, యూసుఫ్, యాస లక్ష్మారెడ్డి, డి. రవికుమార్, కొరకొప్పుల రాంబాబు, కరణబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు ఎంతో మేలు

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

విశ్వంభర, ఎల్బీనగర్ : ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఎంతో ఉపయోగమని ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు.. ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్త పేట డివిజన్ రాజీవ్ గాంధీ నగర్ నందు నివాసం ఉంటున్న శివకుమార్(33 సంవత్సరాలు) కిడ్నీలకు సంబంధిత పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వారి వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా దరఖాస్తు చేయించారు. దీనికి సంబంధించి రెండు లక్షల రూపాయల ఎల్.ఓ.సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు కాగా బాధిత కుటుంబసభ్యులకు చెక్కును అందజేశారు. సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడం ద్వారా మాకు ఎంతో సంతృప్తి లభిస్తుంది. నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎంతోమంది పేద ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కింది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంతుల రాజిరెడ్డి, దీప్ లాల్, ఇటికల యాదగిరి, మహ్మద్ యాసిన్, జోగు నాగేష్, బట్టు అంజయ్య, సూర్యకాంత్ పాల్గొన్నారు.

కార్మికుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

విశ్వంభర, హిమాయత్ నగర్ : జలమండలి కార్మికుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజలకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతోందని చెప్పారు. కార్మికులను ఆదుకోవడంలో ప్రజా ప్రభుత్వం ముందుంటుందని ఆయన తెలిపారు. ఇటీవలే జలమండలి ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ల రాజిరెడ్డి మంగళవారం మినిస్టర్స్ క్వార్టర్స్ లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొగుళ్ల రాజిరెడ్డి, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్యకర్తలకు మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె రాఘవేంద్ర రాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఏ. శ్రవణ్ కుమార్, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కె రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేకే కమిటీ దివ్యాంగ ఉద్యమకారులను గుర్తించాలి

డాక్టర్ ఎం.అశోక్

విశ్వంభర, రామన్నపేట : తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ప్రత్యేక తెలంగాణ కోసం దివ్యాంగులు ఎంతో కీలక పాత్ర పోషించారని, వారి గుర్తింపు కోసం హైదరాబాదులోని చైతన్యపురి శివాజి విగ్రహం వద్ద తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ కాచం సత్య నారాయణ దివ్యాంగ ఉద్యమకారులను ఏకతాటిపై తెచ్చి వందలాది మంది ఉద్యమకారులతో సభను ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో అప్పుడు జరిగిన ఉద్యమాలను గుర్తు చేసుకుని దివ్యాంగులు తెలంగాణ కోసం నిరంతరం పనిచేసే ఉద్యమానికి అండగా ఉన్నారని వారి కృషి మరువలేనిదని డాక్టర్ కాచం సత్యనారాయణ మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం వేసిన కేకే కమిటీ సభ్యులు మోతె శోభన్ రెడ్డి పాల్గొని దివ్యాంగులను గుర్తించి వారి పక్షాన ఉండి న్యాయం చేస్తామని దివ్యాంగులతో కేకే కమిటీ సమావేశం అవుతుందని, తెలంగాణలో ఉద్యమకారులు అందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చి, తెలంగాణ ఉద్యమకారులకు సంబంధించిన వివిధ విధానాలను ప్రకటించి సభలో మాట్లాడారు. దివ్యాంగ ఉద్యమకారులను గుర్తిస్తామని కమిటీ సభ్యులు మాట్లాడడం జరిగింది. ఈ సభకు హాజరైన దివ్యాంగుల విశ్వ విద్యాలయాల పోరం అధ్యక్షుడు, యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలానికి చెందిన డాక్టర్ ఎన్.అశోక్ మాట్లాడుతూ, దివ్యాంగులు తెలంగాణ ఉద్యమంలో ఎంతో క్రియాశీలకంగా ప్రత్యేక తెలంగాణ కోసం పనిచేశారని, వారు టెంట్ కు పరిమితమై కూడా ఎన్నో రోజులు దీక్షలో పాల్గొన్నారని, ప్రతి కార్యక్రమంలో ఉద్యమానికి అండగా ఉన్న దివ్యాంగులను ఎలక్ట్రానిక్ మీడియా మాత్రం కవర్ చేసింది కానీ ప్రింట్ మీడియాలో మాత్రం దివ్యాంగులకు అవకాశం దొరకలేదని, ఉద్యమాల్లో పాల్గొన్నప్పుడు దివ్యాంగులనే గౌరవంతో పోలీస్ కేసులు కూడా నమోదు చేయలేదని, అందువల్ల కమిటీ గుర్తించి పేపర్లలో లేకున్నా అప్పటి మీడియాను సంప్రదించి దివ్యాంగులకు న్యాయం చేయాలని కమిటీని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల కాంగ్రెస్ మేనిఫెస్టో చైర్మన్ చెరుకు నాగ భూషణం, విశ్వవిద్యాలయాల ప్రధాన కార్యదర్శి పల్స అంజనేయులు గౌడ్, విశ్వవిద్యాలయాల ఫోరం ఉపాధ్యక్షులు డాక్టర్ కుర్షిత్ మియా, బండి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి వేణు గౌడ్, సైదులు యాదవ్, రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు రామచంద్రం, మహిళా విభాగం అధ్యక్షురాలు దానమ్మ, తెలంగాణ ఉద్యమ దివ్యాంగ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేశారు.

రిపోర్టర్లు కావలెను

V3 NEWS | ప్రజా విశ్వంభర "విశ్వంభర" తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108